సంపుటి :02 సంచిక :184 పేజీలు :06 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శనివారం 13, సెప్టెంబర్ 2025



## జస్టిస్ లక్ష్మణ్ ను కలిసిన కలెక్టర్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ కె లక్ష్మణ్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి స్వాగతం పలికారు. హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ హైదరాబాద్ నుంచి హనుమకొండలోని ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తో జిల్లా కలెక్టర్ తో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పట్టాభి రామారావు, జస్టిస్ నిర్మలా గీతాంబ భేటీ అయ్యారు.

– అక్షరదర్బార్, హనుమకొండ



## 'ఇందిరమ్మ' పేరిట

# ఇసుక దోచేస్తున్నారు!

02

- తాజాగా వరదలో చిక్కుకున్న ట్రాక్టర్లు
- అక్రమార్కుల దందా బట్టబయలు
- రెవెన్యూశాఖ అండదండలతో దందా
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పర్మిట్లు దుర్వినియోగం
- లబ్ధిదారుకు తెలియకుండా అదనంగా పర్మిట్లు
- ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 చొప్పున లంచం
- ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు విక్రయిస్తున్న 'ఇసుకా'సురులు

### మానేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా

అది మానేరు. ఎగువన ఎల్ఎండీ నుంచి శుక్రవారం ఉన్నట్టుండి వాటర్ రిలీజ్ చేయడంతో వాగులోకి నీళ్లొచ్చాయి. టేకుమట్ల మండలం కళికోటపల్లి వద్ద మానేరు వాగు మధ్యన 10 ఇసుక ట్రాక్టర్లు నీటి ప్రవాహంలో చిక్కుకున్నాయి. డ్రైవర్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వరద నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తాళ్ల సాయంతో వారిని బయటకు తీసుకువచ్చారు. అప్పుడు బయటపడింది ఇసుక దందా.. అసలు మానేరులో ఇసుక రవాణాకు రెవెన్యూశాఖ నుంచి అనుమతులే లేవని తెలిసింది. ఓ రెవెన్యూ అధికారే ఆ విషయాన్ని స్పష్టం చేశారు. ఇంతకీ విషయమేమిటంటే.. మానేరు అక్రమార్కులకు ఇసుక గనిలా మారింది. రోజుకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అందుకు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని వాడుకుంటున్నారు. అసలు దందా ఎలా జరుగుతుందో తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే..

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



## నగల కోసం వృద్ధురాలి హత్య?

మహబూబాబాద్ జిల్లాలో ఘటన

04



లొంగిపోయిన మావోయిస్టు

## సుజాతక్కకు రూ.25 లక్షల రివార్డు

డీజీపీ జితేందర్

04



## అంతర్గత రోడ్లతో రవాణా సౌకర్యం

భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్

04

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- తూర్పు నియోజకవర్గంలో రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

02



## సమగ్ర అభివృద్ధే ధ్యేయం

ఇద్దరు విద్యార్థులకు

## కరెంట్ షాక్

గొల్లబుద్ధారం ప్రభుత్వ హాస్టల్‌లో ఘటన

02

# సమగ్ర అభివృద్దే ధ్యేయం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- తూర్పు నియోజకవర్గంలో రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ తూర్పు నియోజక వర్గం సమగ్ర అభివృద్దే ధ్యేయమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పలు డివిజన్లలో రూ.3 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. ముందుగా వరంగల్ తూర్పులో జీడబ్ల్యూఎంసీ పరిధి లోని 21వ డివిజన్ ఎల్ బీ నగర్ లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు, డ్రైన్స్ పనులకు, కాశి బుగ్గలో రూ.150 లక్షలతో నిర్మించే అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి, రూ.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ పనులకు, 26వ డివిజన్ గిర్మాజీపేటలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైన్స్ పనులకు మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఏసీపీ శుభం, కార్పొరేటర్లు మహ్మద్ ఫుర్ఖాన్, ఓని స్వర్ణలత భాస్కర్, బాల్నే సురేష్, డీఎంహెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, తహసిల్దార్ మహమ్మద్ ఇక్బాల్, బల్దియా ఈఈ సంతోష్ బాబు, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







# 'ఇందిరమ్మ' పేరిట ఇసుక దోపిడీ!

- మానేరు నుంచి అక్రమంగా ఇసుక రవాణా
- తాజాగా వరదలో చిక్కుకున్న ట్రాక్టర్లు
- అక్రమార్కుల దందా బట్టబయలు
- రెవెన్యూశాఖ అండదండలతో దందా
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పర్మిట్లు దుర్వినియోగం
- లబ్ధిదారుకు తెలియకుండా అదనంగా పర్మిట్లు
- ఒక్కో ట్రాక్టర్ కు నెలకు రూ.10 వేల చొప్పున లంచం
- ట్రాక్టర్ ఇసుక రూ.6 వేలకు విక్రయిస్తున్న 'ఇసుకా'సురులు

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :
అది మానేరు. ఎగువన ఎల్ఎండీ నుంచి శుక్రవారం ఉన్నట్టుండి వాటర్ రిలీజ్ చేయడంతో వాగులోకి నీళ్లొచ్చాయి. టేకుమట్ల మండలం కలికోటపల్లి వద్ద మానేరు వాగు మధ్యన 10 ఇసుక ట్రాక్టర్లు నీటి ప్రవాహంలో చిక్కుకున్నాయి. డ్రైవర్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వరద నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తాళ్ల సాయంతో వారిని బయటకు తీసుకువచ్చారు. అప్పుడు బయట పడింది ఇసుక దందా.. అసలు మానేరులో ఇసుక రవాణాకు రెవెన్యూశాఖ నుంచి అనుమతులే లేవని తెలిసింది. ఓ రెవెన్యూ అధికారే ఆ విషయాన్ని స్పష్టం చేశారు. ఇంతకీ విషయమేమిటంటే.. మానేరు అక్రమార్కులకు ఇసుక గనిలా మారింది. రోజుకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అందుకు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని వాడుకుంటున్నారు. అసలు దందా ఎలా జరుగుతుందో తెలుసుకోవాలంటే ఈ కథనం చదవాల్సిందే..

## - దందా ఇలా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం లోని కలికోటపల్లి మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి జారీ అయ్యే పర్మిట్లను దుర్వినియోగం చేస్తూ మానేరు వాగు నుంచి అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక లబ్ధిదారుడు తన ఇంటికి ఇసుక కోసం రెవెన్యూశాఖకు దరఖాస్తు చేసుకున్న తర్వాత, రెవెన్యూశాఖ అతడికి 24 క్యూబిక్ మీటర్ల (8 ట్రిప్పులు) ఇసుక తరలించాల్సి ఉన్నది. అయితే.. ఒకసారి లబ్ధిదారుకు ఇసుక అందించిన తర్వాత, అక్రమార్కులు అతడి పేరుతో మరిన్ని పర్మిట్లు తీసుకుంటున్నారు. లబ్ధిదారుకు తెలియకుండా మధ్యవర్తుల సాయంతో రెవెన్యూశాఖ నుంచి అనుమతులు పొందుతున్నారు. లబ్ధిదారుల పేర్లపై వందల పర్మిట్లు జారీ అవుతున్నట్లు తెలిసింది. సాధారణంగా టేకుమట్ల మండలంలో టేకుమట్ల చలివాగు నుంచి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక పర్మిట్ ఉంది. కానీ, అక్రమార్కులు మానేరు నుంచి ఇసుక తరలిస్తున్నారు. అంతేకాదు అధికారులు జారీ చేసే ఒక్కో పర్మిట్ పై ఒక ట్రిప్ కాకుండా అదనంగా మరో ఒకటి రెండు ట్రిప్పుల ఇసుకను ట్రాక్టర్ల యజమానులు కొందరు అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. మానేరులోని ఇసుక మంచి నాణ్యత ఉన్నది కావడంతోనే అక్రమార్కులు.. ఈ ఇసుకను దోచేసుకుంటున్నారు.

## - రెవెన్యూశాఖ సహకారంతోనే..

అక్రమార్కులు మధ్యవర్తుల సాయంతో రెవెన్యూ అధికారులకు గాలం వేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఒక్కో ట్రాక్టర్‌కు నెలకు రూ.10 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం మానేరు నుంచి 20 నుంచి 25 వరకు ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నాయి. అంటే ఈ చొప్పున రెవెన్యూశాఖ నుంచి సహకరిస్తున్న అధికారికి అక్రమార్కులు నెలకు రూ.2 లక్షలకు పైగా ముట్టజెప్తున్నారని సమాచారం. ఒక్కో అక్రమార్కుడు రోజుకు ఒక్క ట్రాక్టర్ ద్వారా రెండు మూడు ట్రిప్పులు కొడుతున్నారు. ఇలా తరలించిన ఇసుకను బయట బ్లాక్ మార్కెట్లో ఒక ట్రాక్టర్ ట్రిప్పును రూ.6 వేల చొప్పున అమ్ముతున్నారు. అంటే ఒక ట్రాక్టర్ యజమాని రోజుకు రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు సంపాదిస్తున్నారు. ఆ ఇసుక చిట్యాల, రేగొండ, గోరికొత్తపల్లి, మొగుళ్లపల్లి, పరకాల, జమ్మికుంట ప్రాంతాలకు తరలివెళ్తున్నది.

## - రేయింబవళ్లు రవాణా..



టేకుమట్ల మండలం నుంచి నిత్యం ఇసుక అక్రమంగా తరలిపోతున్నా పోలీసులు, రెవెన్యూశాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లకే ఇసుక వెళ్తుందని పోలీసులు భావించి, వాటిని చూసీచూడకుండా వదిలేస్తున్నారని తెలిసింది. తాజాగా టేకుమట్ల మండలంలో రాత్రి వేళ పోలీసులు నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఇవి జమ్మికుంట మండలం వావిలాలకు వెళ్తున్నట్లు గుర్తించారు. సాధారణంగా ఇసుక రవాణాకు పగలు మాత్రమే అనుమతులు ఉన్నాయి. కానీ, అక్రమార్కులు రేయింబవళ్లు ఇసుక తరలిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూశాఖ, పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి, పర్మిట్లను పరిశీలించటం ద్వారా ఇసుక అక్రమ దందాపై ఉక్కుపాదం మోపాలని టేకుమట్ల మండలవాసులు కోరుతున్నారు.

# ఇద్దరు విద్యార్థులకు కరెంట్ షాక్

- గొల్లబుద్ధారం ప్రభుత్వ హాస్టల్ లో ఘటన
- ఆసుపత్రికి తరలింపు.. నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

అక్షరదర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలంలోని గొల్లబుద్ధారం ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థులు కరెంట్ షాక్‌కు గురయ్యారు. తెలిసిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ హాస్టల్ ప్రాంగణంలో చెట్ల కొమ్మలు విపరీతంగా పెరిగాయి. వార్డెన్ వాటిని కొట్టించాల్సి ఉండగా ఆ పని జరగలేదు. చెట్ల కొమ్మలను కొట్టమని తొమ్మిదో తరగతి చదివే ఇద్దరు విద్యార్థులను వార్డెన్ ఆదేశించారు. వార్డెన్ చెప్పడంతో ఇద్దరు విద్యార్థులు కొమ్మలను నరికారు. ఈ క్రమంలో చెట్టు కొమ్మలు కరెంట్ వైర్‌కు తగిలి ఉండటంతో ఇద్దరు విద్యార్థులు విద్యుదాఘాతానికి గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థులను సిబ్బంది వెంటనే భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరు విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



# జస్టిస్ లక్ష్మణ్ ను కలిసిన కలెక్టర్

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ కె లక్ష్మణ్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి స్వాగతం పలికారు. హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ హైదరాబాద్ నుంచి హనుమకొండలోని ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకోగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తో జిల్లా కలెక్టర్ తో పాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పట్టాభి రామారావు, జస్టిస్ నిర్మలా గీతాంబ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యువకులు రాజకీయంగా ముందుకు రావాలి

**బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ రెడ్డి**

అక్షర దర్బార్, నర్సంపేట : యువకులు రాజకీయంగా ఎదిగి తేనే అభివృద్ధి సాధ్యమని వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. నర్సంపేట మండలం ఇప్పల్ తండాకు చెందిన బానోత్ సాగర్, నూతన్, లోకేష్, ధరావత్ అనిల్, అఖిల్, జగన్, సునీల్, జాటోత్ నవీన్, సుమన్, అజ్మీరా రాజుకుమార్, బానోత్ ఈశ్వర్ తదితరులు వివిధ పార్టీలకు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి వారికి కమలం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.బీజేపీ దేశంలో సాధిస్తున్న పురోగతి, జాతీయవాద సిద్ధాంతం యువతను ఆకర్షిస్తోందని ఆయన అన్నారు. తెలంగాణలో 20 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందని విమర్శించారు. ఎప్పుడైనా ఎన్నికలు జరిగినా బీజేపీ సిద్ధంగా ఉంటుందని, యువకులను రాజకీయంగా ముందుకు తీసుకెళ్లి అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో-కన్వీనర్ కట్ల రాంచందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గంగిడి మహేందర్ రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకులు ఎర్ర రాజు, పురాణీ దేవేందర్, సుమన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.





# అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం..

**- మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ**

అక్షర దర్బార్ మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన కేశారపు సమ్మయ్య, ఆకుల పెద్ద పోచాలు, కోట మణి, మల్లారం గ్రామానికి చెందిన కోరుగంటి ప్రశాంత్ ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ శనివారం మృతుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు. అధైర్య పడొద్దు బిఆర్ఎస్ అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. అనంతరం వారి చిత్రపతాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్,పిఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చెప్యాల రామారావు,రావుల మొగిలి తోపాటు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# వెల్లంపల్లిలో ఉచిత వైద్య శిబిరం..

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో జై భీమ్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. గ్రామంలో విస్తరిస్తున్న అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్. విశ్వంత్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు చేసి మందులు అందించారు. డెంటల్ చికిత్సలను డాక్టర్ ఎం. బాపురావు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బొట్ల అరుణ్ కుమార్, యూత్ ఇంచార్జీలు కాకి శరత్ చంద్ర, మచ్చ చందర్, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# మార్కెట్ బంద్.



అక్షర దర్బార్, పరకాల: పరకాల వ్యవసాయ మార్కెట్లో హమాలీగా 30 ఏళ్లుగా సేవలందించిన పుల్ల సారయ్య (55) ఈ నెల 10న ఉదయం ఆకస్మికంగా మరణించారు. ఆయన మృతికి సంతాపంగా సెప్టెంబర్ 14న తమార్కెట్‌ను బంద్ చేస్తామని హమాలీ యూనియన్ నాయకులు లంక దాసరి అశోక్, కోడెపాక ఐలయ్య, కోగిల శంకర్ తదితరులు ప్రకటించారు. మార్కెట్ వ్యాపారులు, హమాలీలు, సిబ్బంది సారయ్య మృతిపై సంతాపం ప్రకటించారు.

# మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే దొంతి

అక్షర దర్బార్, నర్సంపేట :హైదరాబాద్‌లో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను శనివారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థించారు. నర్సంపేట బస్టాండ్‌లో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సమర్పించడమే కాకుండా, నెక్కొండ బస్టాండ్ ఆవరణలో సీసీ ప్లాట్ఫార్మ్ నిర్మించాలని కోరినట్లు తెలిపారు.ఈ సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్ రావు, పర్వతగిరి మాజీ జెడ్పీటీసీ సింగ్ లాల్ పాల్గొన్నారు.



# 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పఖ్వాడా'

**పరకాలలో బీజేపీ సేవా కార్యక్రమాలు ప్రారంభం**

అక్షర దర్బార్, పరకాల : ప్రధాని నరేంద్ర మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు "సేవా పఖ్వాడా"గా సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పరకాల బీజేపీ ప్రకటించింది. పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో, కన్వీనర్ కుక్కల విజయ్ కుమార్ అధ్యక్షతన పరకాల కార్యాలయంలో మండల స్థాయి కార్యాశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి హాజరై, మోదీ జన్మదినం సందర్భంగా ప్రజల మధ్యకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు దేవునూరు మేఘనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పి. జయంత్ లాల్, కోకన్వీనర్ ఆకుల రాజేందర్, పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, అలాగే నాయకులు కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, మార్త రాజభద్రయ్య, మార్త బిక్షపతి, దార్ల నారాయణ దాసు, వెనిశెట్టి శారద, ఆకుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




Hindi Diwas Celebrations



# బాలాజీలో ఘనంగా హిందీ భాషా దినోత్సవం

అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలోని బాలాజీ టెక్నో స్కూల్లో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ పి. రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, హిందీ భాష జాతీయ ఉద్యమంలో ఏకతా సాధనకు దోహదపడిందని, 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగంలోని 351వ అధికరణ ద్వారా కేంద్ర ప్రభుత్వం హిందీని అధికార భాషగా గుర్తించిందని గుర్తు చేశారు. తరువాత హిందీ ఉపాధ్యాయుడు ఎం.డి. రియాజుద్దీన్ ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు కవితలు, గేయాలను చార్టులపై రాసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విష్ణులత, నరసింహస్వామి, లలిత, ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# కల్తీ మందు పిచికారితో రైతు పంట నష్టం

**-న్యాయం చేయాలని రహదారిపై అన్నదాతల ధర్నా**

అక్షర దర్బార్, నల్లబెల్లి : నందిగామ గ్రామానికి చెందిన రైతు ఇస్లావత్ రాజ్‌కుమార్ మూడు ఎకరాల పంట పొలంలో కల్తీ గడ్డి మందు పిచికారి చేయడంతో పంట పూర్తిగా మాడిపోయింది. వ్యాపారి మైనుద్దీన్ వద్ద కొనుగోలు చేసిన మందే కారణమని రైతు ఆరోపించాడు. బాధితుడికి న్యాయం చేయాలంటూ గ్రామ రైతులు, ప్రజాసంఘాలు, యువజన నాయకులు కలిసి నల్లబెల్లిలోని ఎరువుల దుకాణం ముందు ధర్నాకు దిగారు.ప్రధాన రహదారి మీద రాకపోకలు ఆగిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో బొట్ల నరేష్ (ఎంసిపిఐ నాయకుడు), మార్త రాజేందర్, బట్టు సాంబయ్య, జంకిలాల్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ పగడాల పరామర్శ.

అక్షర దర్బార్, పరకాల: పరకాల మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ జడ్పిటిసి సిలువేరు మొగిలి, హైబోత్ పల్లి గ్రామానికి చెందిన నిగ్గుల బాధ్రయ్య కుమార్తె నిగ్గుల రూపలు ఇటీవల మరణించాగా శనివారం వారి నివాసానికి వెల్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందచేసిన పరకాల నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా. పగడాల కాళీ ప్రసాద్ రావు. ఈ కార్యక్రమంలో పరకాల మండల అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, జిల్లా నాయకులు కొమ్మిడి మహేందర్ రెడ్డి, దయ్యాల దేవరాజ్, బాబు యాదవ్ , తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు విశిష్ట సేవా పురస్కారాలు

అక్షర దర్బార్, చిట్యాల : చిట్యాల మండలం జూకల్ గ్రామంలోని లక్ష్మీ విద్యానికేతన్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులకు చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విశిష్ట సేవ పురస్కారాలు అందించారు. సంస్థ అధ్యక్షుడు, కవి-రచయిత మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో కార్యక్రమం జరిగింది.ముఖ్య అతిథిగా హాజరైన మండల తహసీల్దార్ ఇమామ్ బాబా షేక్ పురస్కారాలను అందజేశారు. కార్పొరేట్ స్థాయి పాఠశాలలకు సాటిగా గ్రామంలో విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్న ఉపాధ్యాయులను అభినందించడం సంతోషకరమని ఆయన అన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంబుల తిరుపతి, మాజీ సర్పంచ్ పుట్టపాక మహేందర్, నూనె స్వామి, కసిరెడ్డి మహేందర్, చేయూత సంస్థ ప్రధాన కార్యదర్శి వేమునూరి ధనలక్ష్మితో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## విద్యార్థులకు అభినందనలు

అక్షర దర్బార్ శాయంపేట : జిల్లా స్థాయి కళా ఉత్సవాలు-2025 హనుమకొండ జిల్లా ప్రాక్టీసింగ్ హైస్కూల్లో అంగరంగ వైభవంగా నిర్వహించగా కళా ఉత్సవానికి వివిధ మండలాల నుండి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను అన్ని కలల్లో ప్రదర్శించటం జరిగింది.ఈ ప్రదర్శనలో పిఎంఎస్ఆర్ఐ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కళాశాల, పాఠశాల శాయంపేట భూపాల్ పల్లి విద్యార్థినిలు జిల్లాస్థాయిలో రెండు విభాగాల్లో (3డి విజువల్ ఆర్ట్స్ ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్) లో ప్రథమ బహుమతులు గెలుపొంది స్టేట్ లెవెల్ కి అర్హత పొందడం జరిగింది.3డీ విజువల్ ఆర్ట్ లో శ్రీహిత , లాస్య లు ట్రెడిషనల్ స్టోరీ లో టి శ్రీనిధి, ఎం.మనిషా విద్యార్థినిలు తమ ప్రతిభను కనబరిచి స్టేట్ లెవెల్ కి అర్హత పొందినందుకు శాయంపేట మండలం ఎంఈఓ బిక్షపతి, హెచ్ఎం, విద్యార్థులను అభినందించారు.

## మావోయిస్టు సుజాతక్కకు రూ.25 లక్షల రివార్డు

అక్షరదర్బార్, హైదరాబాద్: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన ఎలియాస్ సుజాతక్క తాజాగా తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నారు. 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్న ఆమెపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను డీజీపీ జితేందర్ వెల్లడించారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క మావోయిస్టు పార్టీ నుంచి బయటకు వచ్చారని తెలిపారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తామన్నారు.

## నగల కోసం వృద్ధురాలి హత్య?



అక్షరదర్బార్, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి నగలు కోసం వృద్ధురాలిని హత్య చేసిన ఘటన చోటుచేసుకుంది. అయితే వృద్ధురాలి మృతదేహం ఇంటి పక్కనే ఉన్న చేద బావిలో శనివారం కనిపించడం, ఆమె చేతిలో బంగారు గొలుసు చిక్కి ఉండడంతో నగల కోసం ఆమెను దుండగులు హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. నెల్లికుదురు గ్రామానికి చెందిన వీరగాని రాధమ్మ (80) ఒంటరిగా ఇంట్లో నివసిస్తోంది. నగలపై కన్నేసిన దుండగులు రాత్రి ఇంట్లోకి వచ్చి ఉంటారని ప్రచారం జరుగుతోంది. రాధమ్మ మృతి ఘటనపై కొడుకు మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సీహెచ్ రమేష్ బాబు తెలిపారు.



# ప్రతి పల్లెకు రవాణా సౌకర్యం కల్పిస్తా..

- గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా మౌలిక వసతులకు కృషి చేస్తా..
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- చిట్యాల మండలంలో రూ.903 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



అక్షర దర్బార్ చిట్యాల : పల్లెల్లో రవాణా సౌకర్యాలను బలోపేతం చేసేందుకు అంతర్గత రహదారుల పనులు వేగవంతం చేస్తున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం భూపాల పల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలం లోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. సుమారు రూ.903 లక్షల వ్యయంతో వివిధ గ్రామాల్లో గ్రావెల్ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ముందుగా ఒడితల గ్రామంలో ఒడితల నుండి మొరంచవాగు వరకు రూ.50 లక్షలు మరియు ఆర్ అండ్ బీ రోడ్డు ఒడితల నుండి బద్దిపోచమ్మ ఆలయం వరకు రూ.50 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, జడల్ పేట గ్రామంలో జడల్ పేట నుండి పాసిగడ్డ తండా వరకు రూ.162 లక్షలు రోడ్డు నిర్మాణ పనులు, రామచంద్రాపూర్ గ్రామం నుండి శాంతినగర్ వరకు రూ.30 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, పంచాయతీ రాజ్ రోడ్డు గుంటూరు పల్లి నుండి చిట్యాల రోడ్డు వరకు రూ.144 లక్షలు రోడ్డు నిర్మాణ పనులు, చింతకుంటరామయ్యపల్లి గ్రామం నుండి శాంతినగర్ వరకు రూ.100 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, నైన్ పాక గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. నాపాక దేవాలయం నుండి మామిడితోట వరకు రూ.40 లక్షలు, ఎస్సీ కాలనీ నుండి మొరంచ బ్రిడ్జి వరకు రూ.20 లక్షలు, చెంచుకాలనీ నుండి పాశిగడ్డ తండా వరకు రూ.207 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, నాపాక సర్వతోభద్ర ఆలయంలో ఎమ్మెల్యే మొక్క నాటి నీరు పోశారు. అనంతరం రూ.100 లక్షలతో ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, అధికారులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామీణ రహదారులు బాగుంటేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, అందుకోసం ప్రభుత్వ నిధులతో పాటు ఇతర పథకాల ద్వారా కూడా రహదారి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం అందే వరకు కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. అభివృద్ధి అన్నది పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా, పల్లెల్లో కూడా సమానంగా ఉండాలి అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## క్రీడల అధికారికి అభినందన

అక్షరదర్బార్, హనుమకొండ: మలేషియాలో జరిగే అంతర్జాతీయ సెమినార్ కు హాజరుకానున్న హనుమకొండ జిల్లా క్రీడలు, యువజన అధికారి గుగులోతు అశోక్ కుమార్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ అశోక్ కుమార్ అంతర్జాతీయ సెమినార్ లో పాల్గొననుండటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, హనుమకొండ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## దానం ఇచ్చిన భూమి కాపాడాలి

**: ఎమ్మెల్యేను వేడుకున్న కాలనీ వాసులు**



అక్షర దర్బార్, చిట్యాల: రాంనగర్ ఎస్సీ కాలనీ వాసులు దానం ఇచ్చిన భూమిని ఇతరుల పాలు కాకుండా కాపాడాలని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానికులు తెలిపారు, గ్రామానికి చెందిన బీరవోలు పాపిరెడ్డి తన భూములను విక్రయిస్తున్న సమయంలో ఎస్సీ కాలనీకి చెందిన కొంతమంది వ్యక్తులు భూమి పై ఆరేపల్లి ఆగయ్య, కటుకూరి నరసయ్య, ఆరపల్లి అంకుష్ వంటి గ్రామ పెద్దలతో కలసి ఎట్టి చాకిరి చేశారని. ఫలితంగా తమ కాలనీకి దానంగా కేటాయించిన 6 గుంటల భూమిని కాపాడాలని వారు కోరారు. ఇప్పటివరకు పాపిరెడ్డి సర్వే నంబర్ 809/1లో ఆరు గుంటల భూమిని 15-12-1997న అప్పటి సర్పంచ్ కొక్కుల సదానందం ఆధ్వర్యంలో దానం చేసారు. అయితే, కొన్ని వ్యక్తులు భూమిని కొనుగోలు చేయడానికి ప్రయత్నించారని, గ్రామస్థుల హెచ్చరికలు కూడా నిర్లక్ష్యంగా జరిగాయని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తహసిల్దార్ కు ఆదేశించి భూమిపై సమగ్ర విచారణ జరపించాలని, బౌండరీ లైన్‌లను ఏర్పాటు చేయాలని, అందులో కాలనీవాసుల కోరిక ప్రకారం ప్రభుత్వ ఖర్చుతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. ఈ నిర్ణయం పై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను కలిసిన సమావేశంలో గ్రామ పెద్దలు కటుకూరి నరసయ్య, ఆరేపల్లి అంకుష్, దాసరపు సాంబయ్య, మహిళలు ముత్యాల వినోద, లక్ష్మి, శీలపాక సర్వే, శీలపాక లక్ష్మి, దాసరపు భాగ్యమ్మ, ఏ కు సమ్మక్క, ముత్యాల లక్ష్మి తో పాటు 50 మంది మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# చెస్ ఆడిన ఎమ్మెల్యేలు

## - ప్రశాంత్ నగర్ లో చెస్ క్లబ్ ప్రారంభం

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ 61వ డివిజన్ ప్రశాంత్ నగర్‌లో శనివారం వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు చెస్ బోర్డు ముందు కూర్చొని ప్రత్యక్షంగా చెస్ ఆడి స్థానికులను ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన ప్రశాంత్ నగర్ చెస్ క్లబ్ ను ఎమ్మెల్యేలు ప్రారంభించారు. యువతలో ప్రాచీన మేధస్సు క్రీడ అయిన చెస్ పట్ల ఆసక్తి పెంచేందుకు, వారిలో వ్యూహాత్మక ఆలోచనా శక్తిని అభివృద్ధి చేసేందుకు ఈ క్లబ్ గొప్ప వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ చెస్ అనేది ఒక మేధో క్రీడ. దీనివల్ల మనం నిర్ణయా



లను ఎలా తీసుకోవాలో, ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో నేర్చుకోవచ్చని అన్నారు. నాగరాజు మాట్లాడుతూ, యువత చెస్ వంటి ఆటలవైపు మొగ్గు చూపితే వారి భవిష్యత్తు దృఢంగా నిర్మాణమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, స్థానిక కాంగ్రెస్ నాయకులు రమాకాంత్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రమేష్, ప్రజాప్రతినిధులు, చెస్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఆర్సీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా సురేష్ గౌడ్

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్సి) సంయుక్త కార్యదర్శిగా మెరుగు సురేష్ గౌడ్, మొగుళ్లపల్లి మండల అధ్యక్షులుగా బొల్లెపల్లి రాజకుమార్ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నియామక పత్రాలు అందించారు. జిల్లా అధ్యక్షుడు తాటికంటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల మహేందర్ పేర్కొన్నారు, పేద ప్రజల సమస్యల పరిష్కారం ప్రధాన లక్ష్యంగా జిల్లా కమిటీ వ్యవహరించాలి అని అన్నారు. నియామకులు సురేష్ గౌడ్, రాజకుమార్ తమపై నమ్మకం చూపిన రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# రాజీ మార్గమే రాజమార్గం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ రమేష్ బాబు



అక్షర దర్బార్, భూపాలపల్లి క్రైం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్ రమేష్ బాబు శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో పాల్గొని, వివాదాల నుంచి దూరంగా, రాజి మార్గాన్ని ఎంచుకొని జీవించాలని సూచించారు. చిన్న వివాదాలపై కోపపడడం కేవలం నష్టమే ఇస్తుందని, కేసులను న్యాయసేవ ద్వారా పరిష్కరించుకోవాలని జడ్జి తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి ఏ. నాగరాజ్ క్షమా గుణం మహత్తరమని, ప్రతీ వ్యక్తి సోదరభావంతో మెలగాలని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి. అఖిల , అడిషనల్ ఎస్.పి. నరేష్ కుమార్ , జిల్లావైద్య ఆరోగ్య శాఖ అధికారి మధుసూదన్ , లేబర్ కమీషనర్ వినోద , గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్ , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వి. శ్రీనివాస చారి ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు , బెంచి మెంబర్లు ఎం.డి. లతీఫ్ అబ్దుల్ కలాం మంగళపల్లి రాజ్ కుమార్ రావుల రమేష్ కనపర్తి కవిత మొయినుద్దీన్ సంధ్య , నాగవత్ తిరుమల , పోలీసు అధికారులు పి.కుమార్ ఏ.నరేష్ కుమార్ , కర్ణాకర్ రావు , వెంకటేశ్వర్లు బ్యాంకు ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# 15న తహసీల్దార్ కార్యాలయం ముట్టడి

## –ఎమ్మార్పీఎస్ నేత పిలుపు

అక్షర దర్బార్, చిట్యాల : చేయూత పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నేత నేరెళ్ల ఓదెలు మాదిగ ఈ నెల 15న చిట్యాల మండల తహసీల్దార్ కార్యాలయం ముట్టడిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా, మండల నాయకులు మాట్లాడుతూ వికలాంగులు, వృద్ధులు, వితంతువులు, చేనేత, బీడీ కార్మికులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన పెన్షన్లను ఇప్పటికీ అందించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ప్రతీ గ్రామం నుండి స్థానికులు పాల్గొని హక్కుల కోసం ముందుకొస్తారని తెలిపారు.

# అధికారుల ఫ్లెక్సీ ఏర్పాట్లు.. వంతెనపై ప్రజల ఫీట్లు..

## - ప్రమాదం అంచున ప్రజల ప్రయాణం

అక్షర దర్బార్, టేకుమట్ల: అధికారులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కరువు అయ్యింది. గర్మిళపల్లి – ఓడేడు వంతెన పై ప్రజల ప్రయాణం అక్కడ స్థానికులని ఆశ్చర్యానికి గురిచేసింది. చిన్న తప్పిదం జరిగినా పెద్ద ప్రమాదంగా మారేదని అక్కడివారు ఆందోళనకు గురయ్యారు. వంతెన పైకి ఎవరు వెళ్లకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: బహుజన సమాజ్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడుగా కళాశ చిరంజీవి ,మండల ఉపాధ్యక్షుడిగా మురహరి మనోజ్ ను నియమించినట్లు బిఎస్పీ జిల్లా అధ్యక్షులు పొన్నం బిక్షపతి గౌడ్ తెలిపారు. మండల నిర్మాణంలో భాగంగా చురుకైన వారిని వివిధ పదవుల్లో నియమిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా నూతన మండల అధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ... మాపై నమ్మకంతో మండల నియామకానికి సహకరించిన అసెంబ్లీ, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరిని కలుపుకొని ఆరెస్పి బాటలో అడుగులేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్తాం అని తెలిపారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఆవరణలో సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు సీఎం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వేణు మాట్లాడుతూ, 2023 సెప్టెంబర్ 13న హనుమకొండ ఏకశిలా పార్క్‌లో జరిగిన ధర్నా సందర్భంగా సీఎం, పీసీసీ అధ్యక్ష హోదాలో ఇచ్చిన హామీలు రెండు సంవత్సరాల తరువాత కూడా అమలు కాలేదని అన్నారు. కార్యక్రమంలో వసంత, అనిల్ కుమార్, రమేష్ పాల్గొన్నారు.



# గుడుంబా పట్టివేత

అక్షర దర్బార్ శాయంపేట : ప్రభుత్వ నిషేధిత గుడుంబా అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొని 20 లీటర్ల గుడుంబాను స్వాధీన పరుచుకున్నట్లు శాయంపేట ఎస్ఐ జె.పరమేశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శాయంపేట మండలం పెద్దకోడేపాక గ్రామంలో ఎస్సై జె.పరమేశ్వర్ తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా పెద్దకోడేపాక గ్రామంలో పాలకుర్తి సారయ్య ఇంటి వద్ద గుడుంబా అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా సారయ్య గుడుంబా అమ్ముతూ పట్టుబడ్డాడు. వెంటనే పంచనామా నిర్వహించి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రభుత్వ నిషేధిత గుడుంబాను అమ్మిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పత్తిపాకలో 2వ రోజు బొడ్డెమ్మ పండుగ



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో బొడ్డెమ్మ పండుగ రెండో రోజు ఘనంగా జరిపారు. గ్రామస్తులు బొడ్డెమ్మలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు, యువతులు, మహిళలు కోలాటాలు ఆడి, పాటలు పాడి ఉత్సవాన్ని ఆనందభరితంగా జరిపారు. మహిళల సాన్నిధ్యం పండుగ ఉత్సాహాన్ని పెంచింది. గ్రామ ప్రజల ఐక్యతతో ఉత్సవం విజయవంతంగా ముగిసింది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915